# నేడే కౌంటింగ్



భూపాలపల్లిలో విధుల్లో చేరిన కౌంటింగ్ సిబ్బంది

- తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం
- ములుగులో కలెక్టరేట్ కార్యాలయం, భూపాలపల్లిలో సింగరేణి మినీ ఫంక్షన్ హాల్‌లో అసెంబ్లీ ఓట్ల లెక్కింపు
- విధుల్లో చేరిన సిబ్బంది
- ములుగులో 22 రౌండ్లు, భూపాలపల్లిలో 23 రౌండ్లు..
- ఉదయం 8గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం
- కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత, 144 సెక్షన్..
- ఏర్పాట్లను పరిశీలించిన రెండు జిల్లాల కలెక్టర్లు భవేశ్‌మిశ్రా, ఇలా త్రిపాఠి



రాజకీయ పార్టీలు, కౌంటింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న భూపాలపల్లి కలెక్టర్ భవేశ్‌మిశ్రా

జయశంకర్ భూపాలపల్లి, డిసెంబర్ 2(నమస్తే తెలంగాణ) : భూపాలపల్లి నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల లెక్కింపు కార్యక్రమం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో గల సింగరేణి మినీ ఫంక్షన్‌హాల్‌లో నేడు(ఆదివారం) ఉదయం 8గంటలకు ప్రారంభం కానున్నది. ఇందుకోసం వరుసగా 14 టేబుళ్లు, ఆర్వో టేబుల్ ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో 317 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరుగగా 23 పోలింగ్ కేంద్రాలకు చెందిన ఓట్లను లెక్కిస్తారు. మొత్తం 23 రౌండ్లలో 317 పోలింగ్ కేంద్రాల ఓట్లను లెక్కించి ఫలితాలు వెల్లడిస్తారు. కంట్రోల్ రూంలో ఎప్పటికప్పుడు సిబ్బంది ఆన్‌లైన్‌లో పొందుపర్చనున్నారు. కాగా కౌంటింగ్ కేంద్రంలో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో రమాదేవి, ట్రైనీ కలెక్టర్ ఉమాశంకర్ ఆధ్వర్యంలో కౌంటింగ్ సిబ్బందికి విధులు కేటాయించి సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్ రూంలో నుంచి ఈవీఎంలను సిబ్బంది, పోలీసు బందోబస్తు మధ్య తీసుకెళ్తారు. ఇందు కోసం పోలీసు భద్రతతో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి భద్రతా సిబ్బంది ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. కౌంటింగ్ హాల్‌కు ఓపక్క మీడియా సెంటర్‌ను, మరో పక్క ఆయా పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సిబ్బందికి ప్రత్యేక హాళ్లను ఏర్పాటు చేశారు.

## కౌంటింగ్ హాల్‌ను పరిశీలించిన కలెక్టర్

భూపాలపల్లిలోని కృష్ణకాలనీలో గల సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని కలెక్టర్ భవేశ్‌మిశ్రా శనివారం పరిశీలించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులకు కౌంటింగ్‌పై అవగాహన కల్పిస్తూ, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కౌంటింగ్ ప్రక్రియలో సిబ్బంది కౌంటింగ్ ఏజెంట్లకు ప్రతి ఫలితాన్ని చూపిస్తూ మీడియా సెంటర్‌కు అనౌన్స్ చేయాలని కోరారు. కౌంటింగ్ ప్రక్రియ సీసీ టీవీ పర్యవేక్షణలో ఉంటుందని తెలిపారు.

## ములుగులో జిల్లాలో ఏర్పాట్లు పూర్తి

ములుగుటౌన్: ములుగు నియోజకవర్గ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు కలెక్టరేట్‌లో ఏర్పాట్లు పూర్తి చేశారు. 303 పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఈవీఎం యూనిట్లు శుక్రవారం ఉదయం కలెక్టరేట్ కార్యాలయంలో స్ట్రాంగ్ రూంకు చేర్చారు.

## 22 రౌండ్లలో లెక్కింపు..

కలెక్టరేట్‌లోని కౌంటింగ్ హాలులో 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ప్రతి కౌంటర్ వద్ద సూపర్‌వైజర్, అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్, 3 రిజర్వ్ బృందాలు, పోస్టల్ బ్యాలెట్ బృందాలను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ అబ్జర్వర్ పర్యవేక్షణలో, ఆర్వో టేబుల్ వద్ద ఆయనతో పాటు ఆర్వో లెక్కింపు సూపర్‌వైజన్, మైక్రో అబ్జర్వర్ ఉంటారు. ప్రతి రౌండ్ ఫలితాన్ని కౌంటింగ్ అబ్జర్వర్, ఆర్వో ఆమోదించిన తర్వాత ఎన్నిలక కమిషన్‌కు నివేదించి మీడియా సెంటర్‌కు పమాచారం అందిస్తారు. అదనంగా పోస్టల్ బ్యాలెట్‌ను లెక్కించడానికి ఒక టేబుల్ ఏర్పాటు ఉంటుంది. అలాగే, ప్రతి టేబుల్‌కు ఒక కౌంటింగ్ ఏజెంట్ ఉంటారు. సెక్యూరిటీ పరిశీలన అనంతరం ఉదయం 7 గంటలకు లోపలికి అనుమతిస్తారని, అబ్జర్వర్, ఆర్వో తప్ప ఎవరికీ మొబైల్ ఫోన్ అనుమతి ఉండదని, పెన్, పెన్సిల్, పేపర్ తప్ప ఏమి సెంటర్‌లోకి అనుమతించ బడవని, భద్రతకు సంబంధించి పోలీస్ సహకారంతో మూడు అంచెల భద్రత ఏర్పాటు చేశారని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. తొలి భద్రతలో కార్లు, వాహనాలు అక్కడే పార్క్ చేయాల్సి ఉంటుందని, రెండో భద్రతలో స్టేట్ ఆర్మ్‌డ్ ఫోర్స్ (రాష్ట్ర బలగాలు) ఏర్పాటు ఉంటుందని, ఇక సెల్‌ఫోన్ ఉందా లేదా తనిఖీ చేస్తారని, మూడో అంచెలో కేంద్ర బలగాలు (సెంట్రల్ రిజర్వ్ ఫోర్స్) కూడా తనిఖీ చేసిన తర్వాత లోపలికి అనుమతిస్తాని పేర్కొన్నారు.

## ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

కౌంటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లను శనివారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు. కౌంటింగ్‌కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు ఉండాలని ఎన్నికల సిబ్బందికి సూచించారు. ఆదివారంజరిగే ఓట్ల లెక్కింపున కు సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్వో అంకిత్, ములుగు తహసీల్దార్ విజయ భాస్కర్, ఎన్నికల అధికారులు ఉన్నారు.

## నేడు ర్యాండమైజేషన్ ఆఫ్ పోలింగ్

నేడు ఉదయం అబ్జర్వర్, రిటర్నింగ్ అధికారి సమక్షంలో మూడో ర్యాండమైజేషన్ ఆఫ్ పోలింగ్ నిర్వహించనున్నారు. శనివారం రెండో దఫా శిక్షణ కార్యక్రమం నిర్వహించడంతో పాటు, కౌంటింగ్ సూపర్‌వైజర్లకు కౌంటింగ్ అసిస్టెంట్లు మైక్రో అబ్జర్వర్లకు కౌంటింగ్ ప్రక్రియపై శిక్షణ ఇచ్చారు. ఈవీఎం గోడౌన్ వద్ద ఇప్పటికే పటిష్ట ఏర్పాట్లు చేశారు.



ములుగు కలెక్టరేట్ కార్యాలయంలో కౌంటింగ్ కోసం ఏర్పాటు చేసిన టేబుళ్లు

- కంట్రోల్ యూనిట్‌లో ఇబ్బందులుంటే అధికారులకు తెలపాలి
- అధికారులు, సిబ్బంది ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు పాటించాలి
- ములుగు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి
- కలెక్టరేట్‌లో ఎన్నికల కౌంటింగ్‌పై అధికారులతో సమావేశం



భూపాలపల్లిలో కౌంటింగ్ సిబ్బందికి విధులు కేటాయిస్తున్న జేసీ వెంకటేశ్వర్లు, ఆర్డీవో రమాదేవి

# సాంకేతికలోపం వస్తే సమాచారమివ్వాలి

ములుగుటౌన్, డిసెంబర్ 2: అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ సమయంలో కంట్రోల్ యూనిట్‌లో ఎటువంటి ఎర్రర్(సాంకేతికలోప) వచ్చినా వెంటనే అధికారి దృష్టికి తీసుకు రావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం కలెక్టర్ చాంబర్‌లో నియోజకవర్గ ఎన్నికల కౌంటింగ్ నిర్వహణపై రిటర్నింగ్ అధికారి అంకిత్‌తో కలిసి అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్ట్రాంగ్ రూమ్ నుంచి కౌంటింగ్ హాల్‌కు ముందస్తుగా కంట్రోల్ యూనిట్‌లను హమాలీలు తీసుకు వస్తారని, ప్రతి 2 టేబుళ్లకు ఒక హమాలీ ఉంటారని, వారికి డ్రెస్‌కోడ్ ఉంటుందన్నారు. ప్రతి టేబుల్ వద్ద వారికి కేటాయించిన కంట్రోల్ యూనిట్లు మాత్రమే చెక్‌చేసి కౌంటింగ్ చేయాలని తెలిపారు. కంట్రోల్ యూనిట్ లెక్కింపు ప్రారంభానికి ముందు కంట్రోల్ యూనిట్‌లో నమోదైన మొత్తం ఓట్లు, ఫారం 17-సీలో నమోదైన ఓట్లు సరి చూసుకోవాలని, తేడా వస్తే వెంటనే సదరు కంట్రోల్ యూనిట్‌ను రిటర్నింగ్ అధికారికి అప్పగించాలని కలెక్టర్ పేర్కొన్నారు. కంట్రోల్ యూనిట్‌లో క్లాక్ ఎర్రర్ వస్తే కొత్త బ్యాటరీ వేసి ఆన్ చేయాలని, అప్పటికీ క్లాక్ ఎర్రర్ వస్తే రిటర్నింగ్ అధికారికి అప్పగించాలన్నారు. కంట్రోల్ యూనిట్‌లో ఎటువంటి ఇబ్బందులు వచ్చినా వెంటనే రిటర్నింగ్ అధికారికి సమాచారం అందించాలని తెలిపారు. కౌంటింగ్ సమయంలో అధికారులు, సిబ్బంది నిబంధనలను గుర్తించుకోవాలని, ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించాలని, కౌంటింగ్ హాల్‌లో అధికారులు, సిబ్బంది మౌనంగా ఉండాలని, ప్రశాంతంగా వ్యవహరించాలన్నారు. ఎటువంటి సందర్భం ఎదురైనా ప్రశాంతంగా లెక్కింపు ప్రక్రియ పకడ్బందీగా నమోదయ్యేలా చూసుకోవాలని, గందరగోళానికి గురి కావద్దని సూచించారు. ప్యాట్ స్లిప్‌ల లెక్కింపు అప్రమత్తంగా చేయాలని, అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆ స్లిప్పులను బ్లాక్ కవర్లలో భద్రపర్చి సీల్ చేయాలని, ఈ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ప్రక్రి య మొత్తం వీడియోగ్రఫీ చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డీ వేణుగోపాల్, కౌంటింగ్ , రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



స్ట్రాంగ్ రూంను పరిశీలించి సిబ్బందికి సూచనలిస్తున్న ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

